batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

8 ఆగస్టు 2026
శనివారం

## నాగార్జునసాగర్‌లో

# ఈ నెల 10న వరుణ యాగం

### సీఎం రేవంత్ రెడ్డి



02

హైదరాబాద్, బతుకమ్మ :రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్‌లో ఈ యాగం నిర్వహించనున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణంలో వరుణ యాగం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళతో కళకళలాడాలని, రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని సంకల్పిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వరుణ యాగం జరగనుంది. యాగం అనంతరం నిర్వహించే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు, ప్రజలకు మేలు కలగాలని ప్రార్థిస్తూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.




# కోర్టు ధిక్కరణ కేసు

### ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిపై బెయిలబుల్ వారెంట్

02



హైదరాబాద్, బతుకమ్మ :కోర్టు ధిక్కరణ కేసులో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియాపై తెలంగాణ హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆయనను ఎక్కడ ఉన్నా అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపరచాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్ల నిధులు విడుదల చేయాలని హైకోర్టు 2024లో ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని అమలు చేయలేదని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి స్పందించకపోవడంతో కోర్టు ధిక్కరణ చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో సందీప్ సుల్తానియాపై బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన న్యాయమూర్తి, ఆయనను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కోర్టులో హాజరుపరచాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రతి విచారణ (వాయిదా)కు సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరు కావాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.



02

# విజయ్ దంపతుల మధ్య వివాదానికి తెర

### విడాకుల పిటిషన్ వెనక్కి తీసుకున్న సంగీత

వెబ్ డెస్క్, బతుకమ్మ :తమిళనాడు సీఎం విజయ్, ఆయన సతీమణి సంగీత మధ్య నెలకొన్న విభేదాలకు ముగింపు పడింది. విడాకుల కోసం సంగీత చెంగల్పట్టు జిల్లా కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా వెనక్కి తీసుకున్నారు. దీంతో ఈ కేసును ముగిస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ కేసు విచారణకు సంగీత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, పిటిషన్‌ను కొనసాగించకపోవడానికి గల కారణాలను కోర్టుకు వివరించారు. తమ మధ్య ఏర్పడిన విభేదాలు తొలగిపోయాయని ఆమె వెల్లడించినట్లు సమాచారం. గతంలో విజయ్ ఓ హీరోయిన్‌తో సన్నిహితంగా ఉంటున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంగీత కోర్టును ఆశ్రయించినట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ కేసు విచారణ సమయంలో విజయ్, సంగీత ఇద్దరూ ప్రత్యక్షంగా హాజరు కాలేదు. తాజాగా సంగీత తన నిర్ణయాన్ని కోర్టుకు తెలియజేయడంతో చెంగల్పట్టు జిల్లా కోర్టు కేసును ముగించింది. ఈ పరిణామంపై విజయ్ అభిమానులు, టీవీకే శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి.

# ఎక్సైజ్‌శాఖలో అవినీతి నియంత్రణకు కృషి



### రెండు నెలల్లో 294 కేసులు 88 అరెస్టులు

#### రికార్డు స్థాయి దాడులు

#### కామారెడ్డి ఎక్సైజ్ శాఖ ఈఎస్ ముకుందా రెడ్డి

02

కామారెడ్డి, బతుకమ్మ :ఆబ్కారీ శాఖ లో అవినీతి నియంత్రణ కోసం కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు కామారెడ్డి జిల్లా మద్యపాన నిషేధ, ఎక్సైజ్ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం, గుడుంబా తయారీ, రవాణా  గంజాయి (ఎన్ డిపీఎస్) లాంటి నేరాల నిరోధానికి తమ శాఖ నిరంతరం కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. గత జూన్, జులై (2026) రెండు నెలల కాలంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టి 294 కేసులు నమోదు చేసి, 88 మంది నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో 40.96 కిలోగ్రాముల ఎండు గంజాయి, 2 వాహనాలు, 125 లీటర్ల గుడుంబా, 4,520 లీటర్ల బెల్లం పానకం, 27 లీటర్ల దేశీ దారు, 33 లీటర్ల ఐఎంఎల్ మద్యం, 28 లీటర్ల బీర్, 7.5 లీటర్ల ఎన్డీపీఎస్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు

# అనుమతులు మంజూరు చేయాలి



02

### ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్

హైదరాబాద్, బతుకమ్మ :కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీ పనులకు తక్షణమే పరిపాలనా, ప్రభుత్వ అనుమతులు మంజూరు చేయాలని, అలాగే ఎల్లారెడ్డి పట్టణంలో నూతన ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని ఈ భేటీలో ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పలు కీలక అభివృద్ధి ప్రతిపాదనలతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

# అర్బన్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేత

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి శుక్రవారం కేంద్ర రోడ్డు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందేవాడ అదనపు వంతెన ( ఆర్ వో బీ ) మంజూరుచేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద ఆర్ యూబీ ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రెండింటికి రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు. అలాగే నిజామాబాద్ లోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ.30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగిందన్నారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు నగరాన్ని కలుపుతూ 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను కూడా  అందజేశామన్నారు. మరొక రోడ్డు నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం, దుబ్బ మీదుగా కాలూర్ రోడ్డు ను పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

# ఘనంగా బోనాల పండుగ వేడుకలు

బిచ్కుంద, బతుకమ్మ :తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని ఆర్కిడ్స్ హై స్కూల్ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పండుగ స్ఫూర్తిని చిన్నారుల్లో పెంపొందించే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం పండుగ వేడుకలను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ గోపి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. పాఠశాల ప్రాంగణాన్ని మల్లెపూల దండలు, వేపాకులు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. విద్యార్థినులు రంగురంగుల చీరల్లో బోనం కుండలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా పోతరాజు వేషధారణలో ఇద్దరు విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. వారి శరీరానికి పసుపు రాసి, మెడలో దండలు ధరించి బోనాల సాంప్రదాయాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రిన్సిపల్ గోపి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను తదుపరి తరానికి అందించాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉంది. బోనాల వంటి జానపద పండుగలు ఐక్యతకు, సామరస్యానికి చిహ్నాలు. విద్యతో పాటు విలువలను కూడా పిల్లలకు నేర్పించాలని అన్నారు. కార్యక్రమం చివరలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి, అందరికీ ప్రసాదాలు పంచారు. విద్యార్థులు పాటలు, డ్యాన్సులతో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు.




# కోర్టు ధిక్కరణ కేసు

హైదరాబాద్, బతుకమ్మ :కోర్టు ధిక్కరణ కేసులో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియాపై తెలంగాణ హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆయనను ఎక్కడ ఉన్నా అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపరచాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్ల నిధులు విడుదల చేయాలని హైకోర్టు 2024లో ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని అమలు చేయలేదని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికి ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి స్పందించకపోవడంతో కోర్టు ధిక్కరణ చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో సందీప్ సుల్తానియాపై బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన న్యాయమూర్తి, ఆయనను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కోర్టులో హాజరుపరచాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రతి విచారణ (వాయిదా)కు సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరు కావాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ఎక్సైజ్‌శాఖలో అవినీతి నియంత్రణ కు కృషి

అలాగే 107 కల్లు శాంపిళ్లను సేకరించి, 8 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శాఖ సమర్థవంతంగా పనిచేయడం వల్లే ఆబ్కారీ రెవిన్యూలో 10 శాతం వృద్ధి సాధించామని అధికారి పేర్కొన్నారు.టితో పాటు జిల్లావ్యాప్తంగా మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు 41 రూట్ వాచ్‌లను ఏర్పాటు చేశామని, వనమహోత్సవంలో భాగంగా 41,000 ఈత మొక్కలు నాటామని చెప్పారు. ఇటీవల సలబత్ పూర్ చెక్‌పోస్ట్ ఘటనలో సంబంధిత కానిస్టేబుల్‌పై ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. జిల్లాలో అక్రమ మద్యం, మాదకద్రవ్యాల రవాణాపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

# విజయ్ దంపతుల మధ్య వివాదానికి తెర

వెబ్ డెస్క్, బతుకమ్మ :తమిళనాడు సీఎం విజయ్, ఆయన సతీమణి సంగీత మధ్య నెలకొన్న విభేదాలకు ముగింపు పడింది. విడాకుల కోసం సంగీత చెంగల్పట్టు జిల్లా కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా వెనక్కి తీసుకున్నారు. దీంతో ఈ కేసును ముగిస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ కేసు విచారణకు సంగీత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, పిటిషన్‌ను కొనసాగించకపోవడానికి గల కారణాలను కోర్టుకు వివరించారు. తమ మధ్య ఏర్పడిన విభేదాలు తొలగిపోయాయని ఆమె వెల్లడించినట్లు సమాచారం. గతంలో విజయ్ ఓ హీరోయిన్‌తో సన్నిహితంగా ఉంటున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంగీత కోర్టును ఆశ్రయించినట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ కేసు విచారణ సమయంలో విజయ్, సంగీత ఇద్దరూ ప్రత్యక్షంగా హాజరు కాలేదు. తాజాగా సంగీత తన నిర్ణయాన్ని కోర్టుకు తెలియజేయడంతో చెంగల్పట్టు జిల్లా కోర్టు కేసును ముగించింది. ఈ పరిణామంపై విజయ్ అభిమానులు, టీవీకే శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి.

# నాగార్జునసాగర్‌లో ఈ నెల 10న వరుణ యాగం

హైదరాబాద్, బతుకమ్మ :రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్‌లో ఈ యాగం నిర్వహించనున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో వరుణ యాగం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళతో కళకళలాడాలని, రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని సంకల్పిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వరుణ యాగం జరగనుంది. యాగం అనంతరం నిర్వహించే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు, ప్రజలకు మేలు కలగాలని ప్రార్థిస్తూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు అనుమతులు మంజూరు చేయాలి

ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు పనులకు పరిపాలనా ఆమోదం, నిధుల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ - ఉప్పల్వాయి ప్రధాన రహదారిపై సర్వాపూర్ - మొండిసడక్ మధ్య హై లెవల్ బ్రిడ్జి, గాంధారి - తిమ్మాపూర్ మధ్య మరో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం ఇవ్వాలని కోరారు. ఈ వంతెనలు నిర్మితమైతే వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా గాంధారి మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే లింగంపేట, సదాశివనగర్, రామారెడ్డి, గాంధారి మండలాల్లో శిథిలావస్థకు చేరుకున్న ఎంఆర్వో, ఎంపీడీవో కార్యాలయాల స్థానంలో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐఓసీ) భవనాల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సమర్పించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా పరిశీలించి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా అమలు చేస్తూ, అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ చేస్తున్న కృషికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# దంతాల ఆరోగ్యానికి బ్రషింగ్ చేయడమే కాదు, వీటికి కూడా దూరంగా ఉండాలి



దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కేవలం రోజూ బ్రష్ చేయడం మాత్రమే కాదు, తీసుకునే ఆహారం, పానీయాల విషయంలో కూడా జాగ్రత్తలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మనకు ఆరోగ్యకరంగా అనిపించే కొన్ని పానీయాలు కూడా దంతాల ఎనామెల్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల దంతాలను బలంగా, ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను డైట్‌లో చేర్చుకోవడం ఎంతో ముఖ్యం. బ్రిటిష్ డెంటల్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం నిమ్మరసం కలిపిన తీపి టీ లేదా ఫ్లేవర్డ్ వాటర్‌ను తరచూ తాగడం వల్ల దంతాల ఎనామెల్ క్రమంగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలాగే వెనిగర్, ఊరగాయలు, అధిక ఆమ్లత్వం ఉన్న మందులను తరచూ తీసుకోవడం కూడా దంతాలు అరిగిపోవడానికి కారణాలుగా పరిశోధకులు పేర్కొన్నారు. అలాగే జీర్ణాశయంలో అధిక ఆమ్లం ఏర్పడే సమస్యలు, కొన్ని ఆహార సంబంధిత రుగ్మతలు కూడా దంతాల ఎనామెల్‌ను దెబ్బతీసే అవకాశం ఉంటుందని అధ్యయనం తెలిపింది. స్పోర్ట్స్ డ్రింక్స్, శీతల పానీయాలు వంటి అధిక ఆమ్లత్వం కలిగిన పానీయాలను తరచూ తీసుకోవడం కూడా దంతాలు అరిగిపోవడానికి కారణమవుతుంది.

# పీఆర్సీ అమలుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

### టీపీటీఎఫ్ అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చినా, మూడు సంవత్సరాలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని టీపీటీఎఫ్ అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపు మేరకు దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శంకర్ భవన్ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పాఠశాల విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీటీఎఫ్ అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై పీఆర్సీ ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూఎస్‌పీసీ రూపొందించిన నాలుగు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12, 13 తేదీల్లో ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట ప్రదర్శనలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే వచ్చే నెల శాసనసభ సమావేశాల సందర్భంగా "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రభుత్వం ముందు 13 ప్రధాన డిమాండ్లను ఉంచింది. వాటిలో తక్షణమే పీఆర్సీ ప్రకటించడం, పెండింగ్ డీఏల విడుదల, ఈ నెల 15లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం, విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించడం, జీవో 25 సవరణ, సర్వీస్ రూల్స్ సమస్యల పరిష్కారం, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపు, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలు, జీవో 317 బాధితులకు న్యాయం, టెట్‌లో సర్వీస్ వెయిటేజ్, మోడల్, ఎయిడెడ్ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, హెల్త్ కార్డుల పూర్తి స్థాయి అమలు వంటి అంశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ డిప్యూటీ అధ్యక్షుడు బి. మల్లేశం, కార్యదర్శి గోపి, ప్రధానోపాధ్యాయుడు సాయన్న, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రతో పాటు శ్రీహరిరావు, శైలేష్, రాజయ్య, దామోదర్, రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్ రాజు, రాములు, గంగాధర్, శ్రీలక్ష్మి, సునీత, రజిని, మాధవి, శాంతాబాయి, స్వర్ణలత, విజయలక్ష్మి, శోభ, పావని, దయానంద్, నందిని, సంతోష్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల భత్యం చెల్లించాలి

### బీఎల్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ భత్యాన్ని చెల్లించలేదని, ఎన్నికల భత్యాన్ని వెంటనే చెల్లించాలని బీఎల్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. ఈ మేరకు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని జోన్ల వాటర్ సెక్షన్ కార్మికులు శుక్రవారం విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ (బీఎల్‌టీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో కార్మికులు తమ న్యాయమైన హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన కార్మికులకు చెల్లిం చాల్సిన భత్యాలను నిలిపివేయడం అన్యాయమని అన్నారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపుగా ఎన్నికల విధుల భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల భత్యాన్ని తక్షణమే చెల్లించకపోతే బీఎల్‌టీయూ ఆధ్వ ర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ జోన్ల వాటర్ సెక్షన్ కార్మికులు పాల్గొని, ఎన్నికల విధుల భత్యాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.

# భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి .....తహసిల్దార్లతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా

### ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు






నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమీక్ష మందిరంలో శుక్రవారం ఆయన అన్ని మండలాల తహసిల్దార్లతో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు ఎన్ని అని ఆరా తీస్తూ, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరుపుతూ ఈ నెలాఖరులోగా అన్నింటిని పరిష్కరించాలని కలెక్టర్ గడువు విధించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీ.ఎం ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వెంటదివెంట ఆర్జీలను పరిష్కరిస్తూ, వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. పై అంశాలకు సంబంధించి నిర్ణీత నమూనాలో రోజువారీగా తనకు వివరాలు పంపాలని ఆదేశించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ కోసం వచ్చిన దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకుని ఈ నెల 17వ తేదీ లోపు అన్ని ఎఫ్.ఆర్.సి దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కస్టం మిల్లింగ్ కోసం లేవీ ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులను ప్రతి పక్షం రోజులకు ఒకసారి అయిన తప్పనిసరిగా సందర్శిస్తూ, ధాన్యం నిల్వలను పరిశీలించాలని తహసిల్దార్లను ఆదేశించారు. నూతన తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణాల కోసం ఆయా మండలాలలో అవసరమైన స్థలాలను గుర్తిస్తూ, సమగ్ర వివరాలతో నివేదికలు పంపాలని సూచించారు.

. . . ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ

ఇదిలాఉండగా, సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత సమయానికి కలెక్టర్ సమావేశ మందిరానికి చేరుకోగా, పలు మండలాల తహసిల్దార్లు గైర్హాజరు కావడాన్ని గమనించి వారి తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత సమయం అనంతరం మరో 15 నిమిషాల వరకు కూడా సమావేశం హాల్ కు చేరుకోలేకపోయిన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా రెవెన్యూ అధికారి గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ఆయా మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

# సమసమాజ నిర్మాణమే ఉద్యమ లక్ష్యం

### ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరికేల పోశెట్టి మాదిగ



నిజామాబాద్, బతుకమ్మ :మత విద్వేషాలు, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణమే ప్రస్తుత ఉద్యమ లక్ష్యమని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరికేల పోశెట్టి మాదిగ పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అన్ని వర్గాలకు విస్తరించిన సందర్భంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని గౌతమ్ నగర్, తారకరామ్ నగర్‌లో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణతో పాటు పేద, అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు సాగాయని అన్నారు. కుల వ్యవస్థ కారణం గానే పేద లు, అణగారిన వర్గాలు వెనుకబడ్డాయని, దోపిడీ, వివక్ష లేని సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గౌతమ బుద్ధు డు, సంత్ రవిదాస్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి. ఆర్. అంబే ద్కర్, జగ్జీవన్ రామ్, కాన్షిరామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేం దు కు ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. అలాగే పేదరికంలో ఉన్న అణగారిన వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం ఉద్యమాలను బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి బల మైన ప్రజా పోరాటాలు నిర్మించాలని కోరారు. ఎంఆర్పీఎస్, ఎంఎస్పీతో పాటు అనుబంధ విభాగాల నూతన కమిటీలను ఏర్పాటు చేసి విద్యా వంతులు, యువతను ఉద్యమంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం వై. కనకయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించగా, తెడు గంగారాం మాదిగ, సుజాత, రమేష్ పాల్గొన్నారు.

# నవదుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :లక్ష్మీ వారం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ నవదుర్గ మాత ఆలయంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి ఈశ్వరి – సుమన్ కుమార్ దివ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి విశేష అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులు, ఉద్యోగులు, ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో వచ్చిన వారికి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి నెత్తికుంట శేఖర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షులు సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, పద్మ, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కార్యదర్శి మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్, గురుచరణ్, స్వామి, విజయలక్ష్మి, మంగమ్మ, గీతారెడ్డి, శరణ్య, టీఎన్‌జీవో ముఖ్య సలహాదారు వనమాల సుధాకర్‌తో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, జిల్లా ప్రజలు పాల్గొన్నారు.



## జిల్లాలో బీసీ చైతన్యం అధికంగా ఉంది

### జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్



వెబ్ డెస్క్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లాలో బీసీ చైతన్యం అధికంగా ఉందని, దేశంలో ఎక్కడ బీసీలకు సంబంధించిన కార్యక్రమాలు జరిగినా జిల్లా నుంచి పెద్ద ఎత్తున పాల్గొని తమ గళాన్ని వినిపించడం ఆనందంగా ఉందని జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన 11వ ఓబీసీ జాతీయ మహాసభల్లో నిజామాబాద్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల్ కమిషన్ సిఫార్సుల అమలు ద్వారా బీసీలకు రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏడాది నిర్వహించే జాతీయ మహాసభల్లో ఈసారి కూడా జిల్లా నుంచి విశేషంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కులు, అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, మాడవేడి వినోద్ కుమార్, చంద్రకాంత్, శ్రీలత, ఆర్టీసీ శ్రీనివాస్, చంద్రమోహన్, భూమన్న, రవి, బాలన్న శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ లైన్ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఫ్యూచర్ లైన్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాముఖ్యత, పండుగకు సంబంధించిన సంప్రదాయాలు, ఆచారాల గురించి విద్యార్థులకు వివరించారు. భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడం, విద్యార్థుల్లో సాంస్కృతిక విలువల పట్ల అవగాహన పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రియాంక, ఇన్‌చార్జ్ లావణ్య, ఉపాధ్యాయులు సంధ్య, గౌతమి, శిరీష, మాధవి పాల్గొన్నారు. వారు విద్యార్థులకు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించి, మన సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు.

## అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

నందిపేట, బతుకమ్మ :నందిపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం – 9 లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు, అక్షరాభ్యాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య నిపుణుల సూచనల మేరకు శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమని, పుట్టిన తర్వాత తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని అంగన్వాడీ సిబ్బంది వివరించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ రేఖ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.







# హాస్టళ్ళు, రెసిడెన్షియల్ స్కూల్స్‌ను విధిగా సందర్శించాలి

### మండల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం


నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌ను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యా సంస్థల నిర్వహణ గణనీయంగా మెరుగుపడేలా, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా మండల స్పెషల్ ఆఫీసర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండల స్థాయి అధికారులను సమన్వయము చేసుకుని ప్రతి వారం -- ప్రతి విద్యా సంస్థను తప్పనిసరిగా సందర్శించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలతో పాటు, జిల్లాలో గల అన్ని కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, మహాత్మా జ్యోతిబాపూలే, బీ.సీ, ఎస్.సీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలను విధిగా సందర్శించి నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు, తేలు కాటు వంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యా సంస్థలను సందర్శించిన సందర్భంగా గమనించిన అంశాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్ ద్వారా తమకు నివేదించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా డ్రైనేజీ సమస్య నెలకొని ఉంటే తక్షణమే పరిష్కరించాలని, సానిటేషన్ సమస్య నెలకొనకుండా చొరవ చూపాలన్నారు. శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలు ఉంటే, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వెంటనే వాటిని తొలగింపజేయాలని ఆదేశించారు. విద్యార్థిని, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన ఎఫ్.ఎల్.ఎన్ విధానం ప్రతి విద్యా సంస్థలోనూ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, చారిత్రక ప్రదేశాల సమాచారాన్ని క్షేత్రస్థాయి అధికారులు పక్కాగా అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించాలి

### రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి

### జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ సమాచార సేకరణపై కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పన కోసం ఫీల్డ్ ఫంక్షనరీలు క్షేత్రస్థాయిలో నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి సూచించారు. జనగణన--2027కు సంబంధించిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పన విషయమై ఆమె శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందించేందుకు విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా , కమ్యూనికేషన్, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, తయారీ చేతివృత్తులు, గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన ప్రత్యేక అంశాలు, పరిశీలనలు వంటి తొమ్మిది ప్రధాన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించేలా చూడాలన్నారు. అదేవిధంగా టౌన్ డైరెక్టరీ షెడ్యూల్ ను ఛార్జ్ ఆఫీసర్లచే(మున్సిపల్ కమిషనర్) నియమించబడిన అధికారుల ద్వారా పట్టణ పౌర, పరిశ్రమలు, సామాజిక సదుపాయాలు, మురికివాడలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారాన్ని సేకరించి ఛార్జ్ ఆఫీసర్లకు అందించాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల సమాచారాన్ని ఛార్జ్ ఆఫీసర్లు డీసీహెచ్ బీ పోర్టల్, మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగించి సమాచారాన్ని నాణ్యతతో నమోదు చేయాలన్నారు. విలేజ్ డైరెక్టరీ సమాచారాన్ని 31.12.2025ను ప్రామాణిక తేదీగా తీసుకుని, రెవెన్యూ గ్రామాల వారీగా మొబైల్ అప్లికేషన్ లో సేకరించాలని సూచించారు. ఈ సమాచార సేకరణ ప్రక్రియ 10.08.2026 నుండి 08.09.2026 వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి వెల్లడించారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, విధానాల అమలు, పరిశోధనలు, పరిపాలనా అవసరాలకు డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ ఒక ముఖ్యమైన ఆధార గ్రంథంగా ఉపయోగపడుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా సమాచారాన్ని సేకరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, సీ.పీ.ఓ కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యా బోధన అందించాలి

### జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్






నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ సూచించారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందుతున్న అధ్యాపకులతో మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి అధ్యాపకుల శిక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థులను భావితరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ బోధన సాగించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల కోసం నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన తొలి విడత (ఫస్ట్ స్పెల్) రెండు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ, ఓరియంటేషన్ శిక్షణ తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరచడంలో దోహదపడిందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బోధించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్‌గా సివిక్స్ అధ్యాపకులు ప్రసాద్, ఎకనామిక్స్ అధ్యాపకురాలు యమున, శివరాజ్, తెలుగు అధ్యాపకురాళ్లు లావణ్య, విజయ, హిందీ అధ్యాపకులు భోజరాం, బాలాజీ అధ్యాపకులకు బోధనా నైపుణ్యాలు, ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ అందించారు. తెలుగు, హిందీ, సివిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బుద్ధిరాజ్, యూ-అబ్జర్వర్ ధర్మపాల్, జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు నర్సయ్యతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంప్రదాయమే బోనం

## స్నేహ సొసైటీ కార్యదర్శి, ప్రిన్సిపాల్ ఎస్. సిద్ధయ్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆషాఢ మాసంలో బోనాల పండుగ నిర్వహించడం తెలంగాణ సంప్రదాయంలో భాగమని స్నేహ సొసైటీ కార్యదర్శి, ప్రిన్సిపాల్ ఎస్. సిద్ధయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని తారకరామనగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలోని అంధుల ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, భక్తుల కోలాహలంతో బోనాల ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. స్నేహ సొసైటీ భవనం నుంచి సమీపంలోని పోలేరమ్మ ఆలయం వరకు భక్తులు బోనాలు మోసుకుంటూ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్ జరీనా ఆధ్వర్యంలో ట్రాన్స్ మహిళలు సంప్రదాయ వేషధారణలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం






ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. స్నేహ సొసైటీ కార్యదర్శి, ప్రిన్సిపాల్ ఎస్. సిద్ధయ్య మాట్లాడుతూ స్నేహ సొసైటీలో 2014 నుంచి ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్ధయ్య, ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంధుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కార్యవర్గ సభ్యులు వీరేశం, టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ మేనేజర్ శివ, ఎం అండ్ ఇ విజయ్, జీఎస్ఎం మౌనిక, శివసత్తులు వంశీప్రియ, సూచి, లాస్య, పోతరాజు నరహరి, ట్రాన్స్ మహిళలు జరీనా, శ్యామలతో పాటు స్నేహ సొసైటీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఆటో, మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## ఐఎఫ్‌టీయూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. శివకుమార్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణలో ఆటో, మోటార్ రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. శివకుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వెజిటేబుల్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన మోటార్ రంగ కార్మికుల జీవన పరిస్థితుల్లో ఇప్పటికీ ఆశించిన మార్పు రాలేదని అన్నారు. రాష్ట్రంలో సుమారు 35 లక్షల మంది మోటార్ రంగ కార్మికులు లారీలు, క్యాబ్‌లు, ఆటోలు, వ్యాన్లు, అంబులెన్స్‌లు,





డీసీఎంలు, మ్యాజిక్ వాహనాలు తదితరాలను నడుపుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరి సంక్షేమం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఆటో, మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే టీజీ ఆర్టీసీ ఆధ్వర్యంలో "ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ కనెక్టివిటీ" పేరుతో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 రోడ్డు భద్రత చట్టంలోని "హిట్ అండ్ రన్" నిబంధనల కింద డ్రైవర్లపై కఠిన శిక్షలు, భారీ జరిమానాలు విధించే నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా మోటార్ రంగ కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షుడు డి. మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు బి. భూమన్న, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు మచ్చ మోహన్, మోటార్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్, ఉపాధ్యక్షులు అక్లక్ ప్రసాద్, ఇర్ఫాన్, హైమద్, మల్లేష్, రమేష్, అప్సర్, గఫర్, జబ్బార్, గబ్రు బి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ పథకం ఎంఆర్పీఎస్ పోరాట ఫలితమే

## మైలారం బాలు మాదిగ

నందిపేట, బతుకమ్మ :రాష్ట్రంలోని అన్ని కులాలకు చెందిన పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం అందుబాటులోకి రావడం ఎంఆర్పీఎస్ ఉద్యమ పోరాట ఫలితమేనని ఎంఆర్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మైలారం బాలు మాదిగ పేర్కొన్నారు. నందిపేట మండల కేంద్రంలోని తుషాల్ గార్డెన్‌లో శుక్రవారం ఎంఆర్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఆర్పీఎస్ నందిపేట మండల ఇన్‌చార్జి పైడకుల ప్రశాంత్ మాదిగ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆరోగ్య సాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఆర్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఆరోగ్యశ్రీ ఒక భరోసాగా నిలిచిందని, ఆ భద్రత వెనుక ఎంఆర్పీఎస్ చేసిన దీర్ఘకాల పోరాటం ఉందని ప్రజలు గుర్తించాలని





ఆయన అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి శాసనసభలో ఎంఆర్పీఎస్ ఉద్యమం కారణంగానే ఈ పథకం అమలులోకి వచ్చిందని ప్రస్తావించారని గుర్తు చేశారు. సమాజంలో మహనీయుల ఆలోచనలే ఎంఆర్పీఎస్ ఉద్యమానికి మార్గదర్శకమని, కుల, మత వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం మాదిగ యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల హక్కుల సాధనే ఎంఆర్పీఎస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న దండోరా ఉద్యమం సమాజ హితం కోసమే సాగుతోందని చెప్పారు. ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో నందిపేట మండలంలోని గ్రామ కమిటీల పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ, మండల స్థాయి కమిటీల్లో మాదిగ యువత చురుకుగా భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన ప్రతినిధులు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# టీచర్స్ కాలనీలో ఫ్రైడే డ్రై డే.

## ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దాం

## వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఖాలేక్

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు టీచర్స్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఖాలేక్, కాంగ్రెస్ యువ నాయకుడు మహమ్మద్ గౌస్ భాష, వార్డు ఆఫీసర్ రోహిత్ కాలనీ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చూడాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కూలర్లు, పూల కుండీలు, ట్యాంకులు, నీటి పాత్రలు తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. కౌన్సిలర్ మహమ్మద్ ఖాలేక్ మాట్లాడుతూ డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి



వారానికి ఒకరోజు డ్రై డే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

## ఏర్గట్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు పూర్ణానందం



ఏర్గట్ల, బతుకమ్మ :డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో అవినీతి, కమిషన్లు జరిగాయంటూ ఏర్గట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఏర్గట్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పూర్ణానందం ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ గృహ పథకాన్ని ప్రవేశపెట్టి వేలాది మందికి ఇళ్లను అందజేసిందన్నారు. ఏర్గట్ల మండలంలో కూడా ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందనీ, సాంకేతిక కారణాలతో కొన్ని పనులు పూర్తికాకపోయినా వాటిని కమిషన్లతో ముడిపెట్టడం రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ఆరోపణలేనని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాల్సింది పోయి, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. నిజంగా పేదల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిధులు విడుదల చేసి మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిపై ఆధారాలు లేకుండా వ్యక్తిగత ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఆయన హయాంలో ఏర్గట్ల మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలుసని, వాటిని ఎంతగా వక్రీకరించినా ప్రజలు నమ్మరని అన్నారు ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ నిలిపివేయాలని, లేకపోతే ప్రజలే తగిన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులో సివిల్ సప్లై అధికారుల తనిఖీలు



రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో శుక్రవారం సివిల్ సప్లై అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్ మాట్లాడుతూ.. రైస్ మిల్ మిల్లర్ కు ప్రభుత్వం ప్యాడింగ్ ను అలాట్మెంట్ చేయడం జరిగిందన్నారు. 2022-2023 కు సంబంధించిన ప్యాడింగ్ డబ్బులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా, అందులో కొంత డబ్బు మాత్రమే చెల్లించారని మిగతా డబ్బులు చెల్లించకపోవడంతో రైస్ మిల్ కు వచ్చి తనిఖీలు నిర్వహించామన్నారు. రైస్ మిల్ మూసివేసి ఉందని, రైస్ మిల్లర్ కు ఫోన్ చేయగా, ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. దింతో పంచనామ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలియజేశారు. సివిల్ సప్లై అధికారులు మహేష్, ఆర్ ఐ భారతి, జిపిఓ స్రవంతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ శిశుమందిర్‌లో ఘనంగా బోనాల వేడుకలు



భిక్కనూరు, బతుకమ్మ :భిక్కనూరు మండల కేంద్రంలో ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బోనాల కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పోతరాజు వేషాలు వేయించి, బోనాలతో వీధుల్లో ఊరేగించారు. డోలు చప్పుళ్లు, పాటలతో వాతావరణం భక్తిమయంగా మారింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకుని ఆకటుకున్నారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ చిన్నారుల్లో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పురం రాజమౌళి, కొడిప్యాక వెంకటేశం, గొల్ల రమేష్, సందుగారి రవీందర్ రెడ్డి, వెంకట నరసింహులు, బత్తుల రాజు ఉన్నారు.

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



ఏర్గట్ల, బతుకమ్మ :నాగేంద్రనగర్ గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. మాతృత్వానికి గౌరవం, శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ వేడుకల్లో శ్రీమంతం, అన్నప్రాశన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించగా, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందించడం, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వడం, ఆ తర్వాత కూడా పోషకాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలు శిశువుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో కీలకమని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సందె రంజిత్ మాట్లాడుతూ, తల్లిపాలు ప్రతి శిశువుకు భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన బిడ్డే అభివృద్ధి చెందిన గ్రామానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి తన బిడ్డకు అందించాలని, తద్వారా ఆరోగ్యకరమైన భావితరాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాకిర్, అంగన్వాడీ టీచర్ అరుణ, ఆశా వర్కర్ సరస్వతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఖ

## జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు...



రుద్రూర్, బతుకమ్మ :జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రూర్ మండల కేంద్రంలోని చేనేత సహకార సంగం ఆవరణలో లోల శంకర్ అధ్యక్షతన కార్మికులకు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. భారతీయ సాంస్కృతిక వారసత్వానికి, కళాత్మక సృజనాత్మకతకు మరియు గ్రామీణ ఆర్థిక రంగానికి వెన్నెముకగా నిలిచిన చేనేత రంగాన్ని గౌరవిస్తూ, చేనేత కార్మికుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ప్రధాన 'జాతీయ చేనేత దినోత్సవమని అన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 7న భారతదేశమంతటా ఈ దినోత్సవాన్ని ఎంతో వైభవంగా, అధికారికంగా నిర్వహిసారని తెలిపారు. ఈసందర్భంగా బోధన్, రుద్రూర్ లో గౌరవంగా పనిచేసి ఇంతటి సంఘ అభివృద్ధికి తోడ్పాటును అందించిన కార్మికు లకు ఘనంగా సన్మానించడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. అదేవిధంగా సంగం అవరణలో సభ్యులకు సమక్షంలో ఎంసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మోత్కూర్ నారాయణ, కార్యదర్శి శ్యామ్ సుందర్ పహాడే, సభ్యులు బేతి గంగారాం, మోత్కూర్ సాయిలు, మోత్కూర్ లక్షణ్, తాటిపాముల విజయ్, జోర్రీగల లక్ష్మి, మోత్కూర్ కళావతి, సన్మాన గ్రహీతలు మామిడి పండరి, నూత్పల్లి నాగమణి, గట్టు సాయిలు, మోత్కూర్ నడిపి గంగారాం, సంగం సిబ్బంది ఈర్వ నాగరాజు, అంకం నర్సింహులు పాల్గొన్నారు.

## స్కీం వర్కర్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్ బాబు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్ బాబు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఆగస్టు 10 న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో ఆశా వర్కర్లు పాల్గొననున్నట్లు సీఐటీయూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నిజామాబాద్ జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా జైలు భరో కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సమావేశం అనంత రం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఏవో అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ కార్మికుల సమ స్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృ తం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుకన్య, నాయకులు విజయ, స్వప్న, రేణు క నర్సు, చంద్రకళతో పాటు వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవాదళ్ సంస్థను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలి

### రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్

హైదరాబాద్, బతుకమ్మ :సేవాదళ్ సంస్థను గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ నాయకుడు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా నూతన పదాధికారులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా నూతనంగా నియమితులైన జిల్లా, అసెంబ్లీ, టౌన్, మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గడ్డమీది మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ




కార్యక్రమంలో కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మెహర్ బాబా గౌడ్, కామారెడ్డి టౌన్ అధ్యక్షుడిగా కోమ్మరాజుల సుదర్శన్, కామారెడ్డి మండల అధ్యక్షుడిగా ప్రణీత్ కుమార్, రాజంపేట మండల అధ్యక్షుడిగా వేణుగోపాల చారి, పాల్వంచ మండల అధ్యక్షుడిగా హరీష్, మాచారెడ్డి మండల అధ్యక్షుడిగా మలోత్ మహేష్, దోమకొండ మండల అధ్యక్షుడిగా దోర్నాల ప్రవీణ్ కుమార్, బీబీపేట్ మండల అధ్యక్షుడిగా కలకుంట్ల రాజు, బిక్నూర్ మండల అధ్యక్షుడిగా గిజువెల్లి మాధవ రెడ్డిలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సేవా దృక్పథంతో ముందుండి పనిచేస్తూ సంస్థను మరింత విస్తరించేందుకు కృషి చేయాలని సూచించారు. నూతనంగా నియమితులైన పదాధికారులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సేవాదళ్ బలోపేతానికి కృషి చేస్తామని, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు.

# చిన్న కాంట్రాక్టర్లను వేధించొద్దు

### గనుల శాఖ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక



హైదరాబాద్, బతుకమ్మ :రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మట్టి, మెటల్ వంటి నిర్మాణ సామగ్రి అనుమతుల పేరుతో చిన్న, నిజాయితీగల కాంట్రాక్టర్లను గనుల శాఖ అధికారులు వేధించవద్దని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామితో కలిసి సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, అక్రమ మైనింగ్‌ను నియంత్రించడంపై దృష్టి సారించాల్సిన అధికారులు, ఒప్పందం ప్రకారం ప్రభుత్వానికి చెల్లింపులు చేస్తున్న కాంట్రాక్టర్లపై మెటీరియల్ విలువ కంటే పది రెట్లు అధికంగా జరిమానాలు విధించడం సమంజసం కాదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. నిజాయితీగా పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు ఇబ్బందులు కలిగించే విధానాలకు ముగింపు పలకాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎఎం) కింద రాష్ట్రంలో చేపట్టిన నాణ్యమైన రహదారుల నిర్మాణ పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి, తెలంగాణ గనులు మరియు ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ బి.వి. రావు, మైనింగ్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి

### పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించిన సీపీ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 10 మంది హెడ్ కానిస్టేబుళ్లు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎస్ఐలు)గా పదోన్నతి పొందారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు శుక్రవారం ఈ పదోన్నతులు కల్పించారు. పదోన్నతి పొందిన సిబ్బంది నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ను కలిసి అభినందనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గత కొంతకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా




ప్రమోషన్ రావడంతో సిబ్బందిలో ఆనందం వ్యక్తమైంది. పదోన్నతి పొందిన అధికారులు తమపై పెరిగిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మరింత సేవలందించాలని కమిషనర్ సూచించారు. ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారిలో ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. శంకర్ (నం.1398), వేల్పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్. కైలాస్ పతి (నం.1300), ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బి. చందూలాల్ (నం.1420), ఎన్ఐబీ నిజామాబాద్‌కు చెందిన ఆర్. మోజీరామ్ (నం.1380), ముగ్పాల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బి. పాండు (నం.1349), టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎ. ముత్తన్న (నం.1307), టౌన్-5 పోలీస్ స్టేషన్‌కు చెందిన బి. రాజు (నం.1325), ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జి. లక్ష్మణ్ (నం.1326), భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జి. శ్రీనివాస్ (నం.1319), వర్ని పోలీస్ స్టేషన్‌కు చెందిన జి.వి. శంకర్ (నం.1313) ఉన్నారు. అదేవిధంగా ఏఆర్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.సి. శర్మ (నం.1433) ఏఆర్ఎస్ఐగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన పోలీస్ సిబ్బందికి పోలీస్ అధికారులు, సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పోచారం

### విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీస్



బాన్సువాడ, బతుకమ్మ :బీర్కూర్ పరిసర గ్రామాల విద్యార్థుల రవాణా సమస్యను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు,ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి వెంటనే స్పందించి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.శుక్రవారం బాన్సువాడ నుంచి తిమ్మాపూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వెళ్తున్న సమయంలో కిష్టాపూర్ గ్రామ బస్టాండ్ వద్ద సుమారు 20 మంది విద్యార్థులు బస్సు కోసం వేచి ఉండడాన్ని గమనించిన పోచారం శ్రీనివాసరెడ్డి వాహనాన్ని ఆపి వారి సమస్యలను తెలుసుకున్నారు.విద్యార్థులు మాట్లాడుతూ బస్సులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో ముందుగా బాన్సువాడకు వెళ్లి అక్కడి నుంచి మరో బస్సులో ఎస్ఆర్ఆన్కె డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో సమయానికి కళాశాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.దీనిపై వెంటనే స్పందించిన పోచారం శ్రీనివాసరెడ్డి బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి బాన్సువాడ--బీర్కూర్--కిష్టాపూర్--తిమ్మాపూర్--బొమ్మందేవ్‌పల్లి చౌరస్తా మీదుగా ఎస్ఆర్ఆన్కె డిగ్రీ కళాశాల వరకు ఉదయం ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అలాగే, విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు సురక్షితంగా, సమయానికి కళాశాలకు చేరుకునేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని సూచించారు.తమ సమస్యను వెంటనే గుర్తించి పరిష్కారం చూపిన పోచారం శ్రీనివాసరెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

## రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి






నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరంతో ఎక్కువ దిగుబడి వచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికా రులతో వానాకాలం సాగు, వన మహోత్సవం, పంట కుం టలు, స్మార్ట్ రేషన్ కార్డుల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలు సాగు చేసే విధంగా దృష్టి సారించాలని తెలిపారు. ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాల వారీగా పరిశీలించగా 3 జిల్లాలలో అధిక వర్షపాతం, 21 జిల్లాలలో సాధారణ వర్షపాతం, 9 జిల్లాలలో లోటు వర్షపాతం నమోదయిందని, మండలాల వారీగా 126 మండలాలలో అధిక వర్షపాతం, 282 మండలాలలో సాధారణ వర్షపాతం, 205 మండలాలలో లోటు, 8 మండలాలలో భారీ లోటు వర్షపాతం నమోదయిందని తెలిపారు. భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ సాగు అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం 2026 లో సాధారణ సాగు విస్తీర్ణం 1 కోటి 32 లక్షల 38 వేల 714 ఎకరాల కాగా తుది సాగు విస్తీర్ణం 1 కోటి ఎనిమిది లక్షల 22 వేల 389 ఎకరాలుగా ఉందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 99.81 లక్షల ఎకరాలలో పంటల సాగు జరిగిందని, పత్తి సుమారు 47.25 లక్షల ఎకరాలు, పప్పు ధాన్యాలు సుమారు 6.14 లక్షల ఎకరాలు, నూనె గింజలు సుమారు 3.76 లక్షల ఎకరాలు, చెరుకు సుమారు 38 వేల 149 ఎకరాలు, కూరగాయలు సుమారు 43 వేల 802 ఎకరాలలో సాగు జరుగుతుందని తెలిపారు. జూలై నెలలో నిర్వహించిన విత్తన మేళాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, 3 వేల 116 మంది రైతులు వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలు కొనుగోలు చేశారని తెలిపారు. వానాకాలం సాగు అవసరాల కోసం గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టుల ద్వారా సాగునీటి విడుదలకు కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు.

. . . వన మహోత్సవం

2026 వన మహోత్సవం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటి వరకు 6.28 కోట్ల మొక్కలు నాటడం/ పంపిణీ చేయడం ద్వారా 39 శాతం ప్రగతి సాధించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నర్సరీల్లో 16.29 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవెన్యూ ప్లాంటేషన్ క్రింద 176.959 కిలోమీటర్ల మేర రహదారుల వెంట, కాలువ కట్టలు, చెరువుగట్లు, వ్యవసాయ భూముల కట్టల వెంట మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుం దని తెలిపారు. బ్లాక్ ప్లాంటేషన్ లో సామాజిక, వ్యవసాయ, చెరువు శిఖం, ప్రభుత్వ భూములు, స్మృతి వనాలు, డంపింగ్ యార్డు, స్మశాన వాటిక లలో, సంస్థాగత ప్లాంటేషన్ లో ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, కళాశాలలు, పాఠశాలలు, హౌసింగ్ కాలనీలు, ఆసుపత్రులు, ఇతర సంస్థలలో, ఇంటి ఆవరణలలో, పారిశ్రామిక ప్రాంతాలలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటేందుకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, నాటిన ప్రతి మొక్కను తప్పనిసరిగా టీజీఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో జియో ట్యాగింగ్ చేసి, వాటి మనుగడ శాతాన్ని నిరంతరం నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

. . . సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువులు

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువుల పథకం పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రాష్ట్రంలోని 31 జిల్లాలలో 13 వేల 46 క్షేత్ర చెరువుల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించగా ఈ నెల 15 నాటికి అన్ని పనులను ప్రారంభించి పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. "ఒకే చెరువు -- ఆరు రకాల జీవనోపాధులు" అనే భావనతో నీటిపారుదల, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, కూరగాయల సాగు, పశు గ్రాస అభివృద్ధి, సేంద్రీయ ఎరువుల తయారీ వంటి కార్యక్రమాల ద్వారా మహిళా రైతుల ఆదాయాన్ని పెంచేలా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని సూచించారు.

. . . స్మార్ట్ రేషన్ కార్డుల అమలు

పౌర సరఫరాల వ్యవస్థను మరింత పారదర్శకంగా, భద్రతాయుతంగా మార్చేందుకు ప్రభుత్వం తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెడుతుందని తెలిపారు. డిజిటల్ సంతకం, హోలోగ్రామ్, వాటర్‌మార్క్, ఎన్‌క్రిప్టెడ్ క్యు.ఆర్ కోడ్, యు.వి. లోగో తదితర అత్యాధునిక భద్రతా ఫీచర్లతో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించడం జరిగిందని తెలిపారు. మొత్తం 1 కోటి 6 లక్షల 20 వేల 92 రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 42 లక్షల 57 వేల 109 మంది లబ్దిదారులకు ప్రతినెల 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 16 లక్షల 32 వేల 810 రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. వర్షపాతం, భూగర్భ జలాలు, పంటల సాగు, విత్తనాల లభ్యత, సాగునీటి పరిస్థితులను జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేసి మనుగడను పర్యవేక్షించాలని సూచించారు. సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువుల పనులను వేగవంతం చేసి, తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సమర్ధవంతంగా అమలు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ డీఆర్డీఓ సాయన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ.**



బాన్సువాడ, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని రేణుక ఒకేషనల్ కళాశాలలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఫీజు బకాయి బీజేపీ లడాయి పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఈ పథకాలపై ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేస్తామని, ప్రతి సంవత్సరం లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు అందక అనేక మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే నిలిపివేస్తున్నారని, ఉద్యోగాల భర్తీ లేక యువత ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేసి ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, ఉమేష్, బీజేపీ నాయకులు భాషా, భాస్కర్ రెడ్డి, చీకట రాజు, అశ్విన్, పురుషోత్తం, సచిన్, నరేష్, పద్మ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుచిత స్టిక్కర్లు అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలి

## డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



బాన్సువాడ, బతుకమ్మ :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటంపై అనుచిత స్టిక్కర్లు అతికించడం, రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని పేర్కొంటూ సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శుక్రవారం బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి, పట్టణ సీఐ తుల శ్రీధర్ లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అవమానకర ప్రచారం చేస్తూ, దేశ యువతను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. ఇటువంటి చర్యలు దేశంలో అశాంతి నెలకొల్పే ప్రయత్నంగా భావిస్తున్నామని, ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనుచిత స్టిక్కర్లు, పోస్టర్లను ఏర్పాటు చేసిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడుగుట్ల శ్రీనివాస్, అందె చిరంజీవి, వంకారు ఉమేష్, సచిన్ యాదవ్, చీకట్ల రాజు, సాయి రెడ్డి, పురుషోత్తం, భూమేష్, మహేందర్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయ సమస్యలు విద్యారంగ సమస్యలే

**టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.సత్యానంద్**



ఏర్గట్ల, బతుకమ్మ :ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి. సత్యానంద్ ఆరోపించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్పీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఏర్గట్ల మండలంలోని పలు పాఠశాలల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల వైఖరి కారణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా బలహీనపడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగానికి 15 శాతం నిధుల కేటాయింపు హామీని ప్రభుత్వం విస్మరించిందని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతుల ప్రారంభంపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదని అన్నారు. కేవలం యూకేజీ తరగతులకే పరిమితం చేయడం వల్ల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే నిర్వహించడం వల్ల ఆ తర్వాత చిన్నారుల సంరక్షణపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందన్నారు. ప్రాథమిక విద్యకు నష్టదాయకంగా ఉన్న జీఓ 25ను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. కొత్త జిల్లాలకు డీఈఓ పోస్టులు, రెవెన్యూ డివిజన్ స్థాయిలో డిప్యూటీ ఈఓ పోస్టులు, ప్రతి మండలానికి ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్ నిబంధన లను పీఓ 2018కు అనుగుణంగా రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని, ఆగస్టు 15లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని యుఎస్పీసీ నాయకులు కోరారు. టెట్‌లో సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని, స్పెషల్ టెట్‌ను సబ్జెక్టుల వారీగా నిర్వహించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, జీఓ 190ను అమలు చేయాలని, పెండింగ్ డీఏ బకాయిలను విడుదల చేయాలని, పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం దశలవారీ పోరాటాలకు యుఎస్పీసీ పిలుపునిచ్చింది. ఆగస్టు 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టాలని, పీఆర్సీ ప్రకటించే వరకు ప్రతిరోజూ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని నిర్ణయించింది. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసనలు, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయడం, ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని ప్రకటించింది. ఆగస్టు 29న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని యుఎస్పీసీ నాయకులు హెచ్చరించారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా పోరాటంలో భాగస్వామ్యం కావాలని, ఉపాధ్యాయులు సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పి. గణేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం రైతులంతా ఏకమవ్వాలి

**చెరుకు ఉత్పత్తి దారుల సంఘం జిల్లా కన్వీనర్ ఆకుల పాపయ్య**

డిచ్ పల్లి, బతుకమ్మ :16 సంవత్సరాలుగా మూతపడిన ఎన్‌సీఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు రైతులంతా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ ఆకుల పాపయ్య పిలుపునిచ్చారు. చెరుకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డిచ్ పల్లి, నల్లవెల్లి గ్రామాల్లో రైతులను కలిసి ఈ నెల 13న జరగనున్న రైతు సమ్మేళనానికి హాజరుకావాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఆకుల పాపయ్య మాట్లాడుతూ తొలుత ఈ నెల 9న రైతు సమావేశం నిర్వహించాలని భావించినప్పటికీ, వివిధ గ్రామాల్లో పండుగల నేపథ్యంలో తేదీని ఆగస్టు 13కు మార్చినట్లు తెలిపారు. ఆగస్టు 13న చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించే రైతు సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రైతుల భాగస్వామ్యంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీకి అప్పట్లో ఒక్కో రైతు రూ.100 చొప్పున షేర్లు చెల్లించి రూ.2.94 కోట్ల నిధులు సమకూర్చారని, ప్రభుత్వం రూ.50 లక్షల మూలధనం అందించిందని గుర్తుచేశారు. ఈ ఫ్యాక్టరీ ప్రారంభ సమయంలో సుమారు 6 వేల మంది రైతులు చెరుకు పండించి సరఫరా చేశారని, మరో 5 వేల మంది వరకు వ్యవసాయ కూలీలు, కార్మికులకు ఉపాధి లభించిందని అన్నారు. రైతులు, కార్మికులకు అండగా నిలిచిన ఈ ఫ్యాక్టరీ




పాలకుల తప్పుడు విధానాలు, అధికారుల అవినీతి కారణంగా మూతపడిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తే రైతులంతా చెరుకు సాగుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశంలో బెల్లానికి మంచి డిమాండ్ ఉన్నందున సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని బెల్లం ఉత్పత్తి కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆరుతడి పంటల వైపు వెళ్లాలని సూచిస్తున్న నేపథ్యంలో చెరుకు కూడా ఆరుతడి పంట కాబట్టి, రైతులు చెరుకు సాగు చేయాలంటే ముందుగా ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వాలని ఆకుల పాపయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ గంగారెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, నల్లవెల్లి సర్పంచ్ కన్నె గంగాధర్, కొట్టె గంగాధర్, టెక్మాల్ లక్ష్మణ్, అగ్గు ఎరన్న, బాల్ రెడ్డి, గంగాధర్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

# పిటిషన్లపై తక్షణ స్పందించాలి

**జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర**

కామారెడ్డి, బతుకమ్మ :ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్లకు అందించే ప్రతి పిటిషన్‌పై తక్షణమే స్పందించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర ఆదేశించారు. ప్రతి పిటిషన్‌ను ఎలాంటి ఆలస్యం లేకుండా సీసీటీఎన్ఎస్ లో నమోదు చేసి, ఫిర్యాదుదారులకు వెంటనే రశీదు అందించాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రిసెప్షన్ వర్టికల్ ట్రైనింగ్ కార్యక్రమం లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు పోలీస్ శాఖతో జరిగే తొలి పరిచయ వేదిక రిసెప్షన్ వర్టికల్ అని, అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే పిటిషన్లను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, చట్టపరమైన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందించే పోలీస్ సేవల్లో వేగం, పారదర్శకత, బాధ్యత ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమయంలో వారి ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, అవసరమైన సహాయం అందిస్తూ సరైన మార్గదర్శకత్వం ఇవ్వాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో




అదనపు ఎస్పీ కె.నరసింహారెడ్డి, సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న రిసెప్షన్ వర్టికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ సౌత్ జోన్ - 1 తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకి తొలి పతకం

**నవ్యభారతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి ఎం. స్వరిత్ తేజ్‌కు కాంస్య పతకం**

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా క్రీడా చరిత్రలో ఒక కొత్త అధ్యాయం నమోదైంది. సీబీఎస్ఈ సౌత్ జోన్ - 1 తైక్వాండో ఛాంపియన్ షిప్ - 2026 లో నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థి ఎం.స్వరిత్ తేజ్ కాంస్య పతకం సాధించి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. సీబీఎస్ఈ పాఠశాలల చరిత్రలో సౌత్ జోన్ స్థాయిలో పతకం సాధించిన తొలి క్రీడాకారుడిగా నిలిచి జిల్లాకు గర్వకారణంగా మారాడు. నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఎం. స్వరిత్ తేజ్, అండర్-14 బాలుర (27--29 కేజీల విభాగం) క్యోరుగి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలు ఆగస్టు 4 నుంచి 8, 2026 వరకు హైదరాబాద్ పటాన్‌చెరులోని ఒరిజిన్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా జరిగాయి. ఈ ఛాంపియన్‌షిప్‌లో సౌత్ జోన్ పరిధిలోని వివిధ సీబీఎస్ఈ పాఠశాలల నుంచి అండర్ - 14, అండర్ -17, అండర్ - 19 బాలురు, బాలికల విభాగాల్లో అత్యుత్తమ క్రీడాకారులు పాల్గొన్నారు. వారిని అధిగమిస్తూ స్వరిత్ తేజ్ సాధించిన విజయం విశేషంగా నిలిచింది. స్వరిత్ తేజ్ ఈ స్థాయికి చేరుకోవడం వెనుక నాలుగు సంవత్సరాల నిరంతర సాధన, కఠిన శిక్షణ, క్రమశిక్షణ, పట్టుదల ఉన్నాయి. గత నాలుగు సంవత్సరాలుగా క్యూరియస్ తైక్వాండో అకాడమీలో మాస్టర్ వినోద్ నాయక్ (3వ డాన్ బ్లాక్ బెల్ట్, అంతర్జాతీయ పతక విజేత, హెడ్ కోచ్) ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. ఆయన మార్గదర్శకత్వం, నైపుణ్యంతో కూడిన శిక్షణ స్వరిత్ తేజ్ విజయానికి కీలకంగా నిలిచాయి. ఈ సందర్భంగా తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లాలో తైక్వాండో క్రీడ అభివృద్ధికి సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించడం, జిల్లా స్థాయి పోటీల నిర్వహణ, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఆటగాళ్లను సిద్ధం చేయడంలో సంఘం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. స్వరిత్ తేజ్ సాధించిన కాంస్య పతకం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా నవ్యభారతి గ్లోబల్ స్కూల్, క్యూరియస్ తైక్వాండో అకాడమీ, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్, నిజామాబాద్ జిల్లా, తెలంగాణ తైక్వాండో సమాజానికి గర్వకారణమైన ఘనతగా నిలిచింది. ఈ




సందర్భంగా స్వరిత్ తేజ్‌కు, ఆయన తల్లిదండ్రులకు, నవ్యభారతి గ్లోబల్ స్కూల్ యాజమాన్యానికి, కోచ్ మాస్టర్ వినోద్ నాయక్‌కు, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో స్వరిత్ తేజ్ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మున్సిపల్ సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి పురపాలక సంఘంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ల బృందం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు వినతిపత్రం సమర్పించింది. వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు కలెక్టర్‌తో పాటు లోకల్ బాడీస్ అసిస్టెంట్ కలెక్టర్ వై.వి. గిరిని కలిసి మున్సిపాలిటీలోని పరిపాలనా సమస్యలను వివరించారు. మున్సిపాలిటీలో పాలన గాడి తప్పిందని, కౌన్సిల్ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించకపోవడంతో వార్డుల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గత ఆరు నెలలుగా పట్టణంలో చెత్త సేకరణ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చెత్త సేకరణ కోసం కొత్త ఆటోల కొనుగోలుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని వారు కోరారు. అలాగే మున్సిపల్ జేసీబీ వినియోగంపై కూడా కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. జేసీబీని బాధ్యతగల మున్సిపల్ అధికారి పర్యవేక్షణలో ఉంచి సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల జోక్యం పెరిగిందని, సిబ్బందిపై వారు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపిస్తూ సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ మంజూరు చేసిన మొరం టెండర్ల అమలులో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కూడా కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రిపుల్స్ పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించిన విద్యార్థులు**



బాన్సువాడ, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను బాన్సువాడ పట్టణంలోని రిపుల్స్ పాఠశాలలో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులు, పూలతో అందంగా అలంకరించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, అమ్మవారి వేషధారణలో ఆకట్టుకున్నారు. బాలికలు తలపై బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించగా, డప్పు చప్పుళ్లు, జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ జానపద కళలను ప్రతిబింబించే పాటలు, నృత్యాలతో విద్యార్థులు ప్రేక్షకులను అలరించారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ సంస్కృతిని గౌరవిస్తూ, సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజబాబు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

## కార్యకర్తలను నాయకులుగా చేసేందుకు పుట్టిన పార్టీ జనసేన

**8వ తేదీన జనసేన పార్టీ రెండు జిల్లాల సన్నాహక సమావేశం**

**జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు మీసాల శ్రీనివాసరావు**




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జనసేన పార్టీ కార్యకర్తలను నాయకులుగా చేసేందుకే పుట్టిన పార్టీ అని జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు మీసాల శ్రీనివాసరావు వెల్లడించారు. జనసేన పార్టీ నిజామాబాద్, జహీరాబాద్ జిల్లాల సన్నాహక సమావేశం ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని సుగుణ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కేంద్రంలో గాని, రాష్ట్రంలో గాని కీలకంగా మారబోతు న్నారన్నారు. శనివారం నిర్వహించబోయే సన్నాహక సమావేశానికి రాష్ట్రం లోని ముఖ్య నాయకులందరూ విచ్చేస్తున్నారని కార్యకర్తలు అందరూ పాలొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన రాష్ట్ర అబ్జర్వర్ శర్మ, మీడియా ఇన్చార్జ్ దుంపటి శ్రీనివాస్, జిల్లా నాయకుడు గుండా సంతోష్, కోరుట్ల నాయకులు అజయ్, ఉప సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు రమేష్ బాసవేణి పాల్గొన్నారు.

## లైన్‌మెన్‌ను తొలగించాలని ఫిర్యాదు



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన లైన్‌మెన్ అఫ్జల్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారు లకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని పేర్కొంటూ, లైన్ మెన్‌ను విధుల నుంచి తొలగించాలని కోరారు. గ్రామ సర్పంచ్ గంగమని గంగారాం, ఉపస ర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ రియాజ్, వైస్ చైర్మన్ బాగిర్తి నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఇందల్వాయి గ్రామం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో రాత్రి సమయాల్లో పాములు, ఇతర జంతువులు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని, అందువల్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్ కో ఏఈ, ఎస్ఈలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తేలు రాములు, బండి సుదర్శన్, తుమ్మల సత్యం, ఎడపల్లి నడిపి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.